## క్లుప్తంగా

### డైరీ ఆవిష్కరణ



వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సోమవారం వ్యవసాయ విస్తరణాధికారులకు సంబంధించిన 2024 డైరీని ఆసంఘం ప్రతినిధులతో కలిసి జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపల్లి సుధీర్‌కుమార్‌బాబు, జిల్లా కోశాధికారి దస్తగిరి, డీఏఓ కార్యాలయం ఏడీ మాధవి, డీఏఓ కార్యాలయ ఏవో సుమంత్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు సుబ్బనరసయ్య, హసీనా, భారతి తదితరులు పాల్గొన్నారు.

### పశువైద్యుల సంఘం ఆధ్వర్యంలో..



డైరీని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శారదమ్మ, అసోసియేషన్ నాయకులు

కడప అగ్రికల్చర్ : పశు వైద్యుల సంఘం డైరీని సోమవారం కడపలోని పశుసంవర్థక శాఖ జిల్లా కార్యాలయంలో జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ డైరీ ఉద్యోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పశుసంవర్థకశాఖ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీధర్‌లింగారెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ నెతాజీ, ఏపీ వెటర్నరీ అసిస్టెంట్స్ సర్జన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామిరెడ్డి, పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్స్ డాక్టర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం

కడప కార్పొరేషన్ : కడప నగరం పాతరిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఎం. సుబ్బారెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు శంకరాపురం అశోక్ కుమార్, వల్లి బాష (బొమ్మన్) సుబ్బరాయుడు, బాబు, మాధవరెడ్డి, వసతి గృహనిర్వాహకులు విజయ్ బాబు, అనుష తదితరులు పాల్గొన్నారు.

### నేడు అవగాహన ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ ర్యాలీకి ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, అదనపు పోలీసు సూపరింటెండెంట్ లోసారి సుధాకర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్ పాల్గొంటారన్నారు.

### కలెక్టరేట్ వద్ద ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : పోరుమామిళ్లలో భూకబ్జాలు అరికట్టి పేదలు వేసుకున్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో 15 ఏళ్ల క్రితం తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు ఇళ్ల స్థలాలు వేసుకున్నారని సీపీఎం జిల్లా సభ్యుడు మనోహర్ తెలిపారు. అయితే తగిన వసతులు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఇల్లు వేసుకున్న అందరికీ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్, దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని సంజీవ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9396161936 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### మరియాపురం తిరుణాలకు మేయర్‌కు ఆహ్వానం



మేయర్‌ను ఆహ్వానిస్తున్న చర్చి ఫాదర్ బిరుసు రాజా తదితరులు

కడప కార్పొరేషన్ : కడప నగరం మరియాపురంలో ఈనెల 10,11 తేదీలలో జరుగనున్న తిరుణాలకు హాజరుకావాలని మేయర్ సురేష్ బాబుకు చర్చి ఫాదర్ బిరుసు రాజా ఆహ్వానం అందించారు. సోమవారం ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, 40వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. బాలస్వామిరెడ్డి తదితరులు మేయర్‌ను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి



'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక కమిషనర్ జీఎస్‌ఎస్ ప్రవీణ్ చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 57 మంది అర్జీలు సమర్పించారు. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి-15 అర్జీలు, ఇంజనీరింగ్ విభాగం- 12, రెవిన్యూ విభాగం -4, హెల్త్ విభాగం-3, యూపీఏ విభాగం-6, కడప తహసీల్దార్-1, సచివాలయ విభాగం- 9, ఏపీ ఎస్పీడీసీఎల్- 2, హౌసింగ్‌కు సంబంధించి 5 అర్జీలు వచ్చాయి. ఈ సమస్యలపై ఆయా శాఖాధిపతులు పరిశీలన చేసి తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఇందులో ఎలాంటి జాప్యం ఉండరాదన్నారు.

**గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి ..**

కడప నగరంలో పుట్లంపల్లి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉక్కాయపల్లె, వినాయకనగర్‌లలో నిర్మిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయా పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ కమిషనర్ వై ఓ నందన్, ఎస్ఈ రత్నాల రాజు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, డీఈలు, ఆర్ఓలు పాల్గొన్నారు.

# సకాలంలో వైద్య సేవలు అందించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యులు వైద్య సేవలను అందించాలని జిల్లా ఉపరవాణా శాఖ కమిషనర్ ఈ.మీరా ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం 35వ జాతీయ రహదారి భద్రత మహోత్సవాల సందర్భంగా నగర శివార్లలోని రిమ్స్ లో గుడ్ సమ్మరిటన్ లాస్ అనే అంశంపై వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులను దగ్గరలో ఉన్న హాస్పిటల్లో స్వచ్ఛందంగా ఎవరైనా చేర్పించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా గాయపడితే సమీపంలోని హాస్పిటల్‌లో చేర్పించి వెళ్లిపోవచ్చని, వారు ఏ విధమైన మెడికల్ బిల్లులు, ఫీజులు గాని చెల్లించవలసిన అవసరం లేదన్నారు. వీరిపై ఎటువంటి పోలీసు కేసులు ఉండవు అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేసిన వారికి గుడ్ సమ్మరీటన్ కింద రూ. 5వేలు బహుమానం అందించి ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. ఒకవేళ సాయం చేసిన వారిలో ఎక్కువ మంది ఉంటే రూ.5 వేలు సమానంగా పంచి వారికి విడివిడిగా ప్రశంస పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఎక్కువ రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేసిన వారికి రూ.లక్ష వరకు నగదు బహుమతిని అందజేస్తామన్నారు. రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రహదారి నియమాలను తప్పక పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పక హెల్మెట్‌ను ధరించాలి అన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు విజయభాస్కర్, ప్రసాద్, రిమ్స్ హెచ్ఓవోడీలు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతల స్వీకరణ



కడప తహసీల్దార్ సిద్దల శివప్రసాద్



కడప అర్బన్ తహసీల్దార్ వెంకట రమణ



ఆర్డీఓ కార్యాలయ ఏఓ రమేష్‌బాబు



వైవీయూ వైస్ ప్రిన్సిపాల్ షావల్లీఖాన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కడప తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన సిద్దల శివప్రసాద్ సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా సీఎం జిల్లాలో కడప తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికలను అధికారులతో కలిసి సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేష్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

**అర్బన్ తహసీల్దార్‌గా ..**

కడప అర్బన్ తహసీల్దార్‌గా కనిశెట్టి వెంకట రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1983లో జూనియర్ అసిస్టెంట్‌గా వాయల్పాడులో, 1987లో సీనియర్ అసిస్టెంట్‌గా మదనపల్లె, 1996లో డిప్యూటీ తహసీల్దార్‌గా పుంగనూరు, 2008లో తహసీల్దార్‌గా రేణిగుంట, తిరుపతి రూరల్, నగిరి, తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తూ కడపకు బదిలీపై వచ్చారు. ఈయన గత ఎన్నికల్లో కూడా జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది.

**ఆర్డీఓ కార్యాలయ ఏఓగా ..**

కడప ఆర్డీఓ కార్యాలయ ఏఓగా వై.రమేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతిలోని దేవదాయశాఖలో స్పెషల్ తహసీల్దార్‌గా పనిచేస్తూ కడప ఏఓగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ వెంకటస్వామి సత్యసాయి జిల్లా ఆర్డీఓ కార్యాలయ ఏఓగా బదిలీపై వెళ్లారు.

**వైవీయూ వైస్ ప్రిన్సిపాల్‌గా..**

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినేషన్, అదనపు చీఫ్ వార్డెన్‌గా ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్ర ఆచార్యులుగా పనిచేస్తున్న ఈయన గతంలో సీడీసీ డీన్‌గా, దూరవిద్యాకేంద్రం వ్యవస్థాపక సంచాలకులుగా, అకడమిక్ అఫైర్స్ డీన్‌గా బాధ్యతలు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆచార్య పి.ఎస్.షావల్లీఖాన్‌కు ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో పాటు పలువురు ఆచార్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# స్కౌట్‌తో క్రమశిక్షణ అలవడుతుంది

**పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి**



ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డికి పూలగుచ్ఛం అందజేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్ : దేశభక్తి, సామాజిక సేవతోపాటు క్రమశిక్షణను విద్యార్థుల్లో పెంపొందించడంలో స్కౌట్ అండ్ గైడ్స్ దోహదం చేస్తుందని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గ సభ్యులు ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి గౌరవ సూచకంగా పుష్పగుచ్ఛాన్ని అందచేశారు.

నూతనంగా ఎన్నికైన స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ మాస్టర్లు, కెప్టెన్లు డీఈఓ రాఘవరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ప్రమీల, అన్నమయ్య జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, హెడ్‌క్వార్టర్ జిల్లా కమిషనర్ రమణయ్య, జిల్లా అసిస్టెంట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# అదనపు ఎస్పీకి సన్మానం



లోసారి సుధాకర్‌ను సత్కరిస్తున్న జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : జిల్లా అదనపు ఎస్పీ లోసారి సుధాకర్‌ను సాహిత్య సంఘాలు, బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు సత్కరించారు. సోమవారం వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి తదితరులు ఆయనను కలిసి సత్కరించారు.

సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సంచాలకులు ఆచార్య టి.రాంప్రసాద్‌రెడ్డి జిల్లా అదనపు ఎస్పీ లోసారి సుధాకర్‌ను కలిసి సత్కరించారు. ఈ నెలలో బ్రౌన్ కేంద్రంలో నిర్వహించనున్న డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి దశమ వర్ధంతి కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, రంగస్థల నటుడు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# 'భారతవాణి'లో సీమ పదాలకు చోటు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి రచించిన రాయలసీమ యాస, భాష పుస్తకంలోని పదాలకు భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మైసూరులో గల సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ నిర్వహిస్తున్న భారతవాణి ఆన్‌లైన్ నిఘంటువులో స్థానం దక్కింది. ఈ మేరకు రచయిత శివారెడ్డికి ఇనిస్టిట్యూట్ అధికారులు డాక్టర్ ఎల్ఆర్ ప్రేమ్ కుమార్, గౌతమ్‌లు ఉత్తరం ద్వారా తెలిపారు. మూడు వేల రాయలసీమ మాండలిక పదాలతో డాక్టర్ శివారెడ్డి పుస్తకం తెచ్చారు. అందులోని పలు పదాలకు భారత వాణి వెబ్‌సైట్, యాప్‌లలో స్థానం లభించింది. ప్రపంచంలోనే ఏ ప్రాంతం నుంచైనా ఈ యాప్ ద్వారా అర్థాలు తెలుసుకునే అవకాశం ఉందని రచయిత తెలిపారు.

ఈయనను వైవీయూ ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రాంప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు అభినందించారు.

## కరాటేలో ప్రతిభ



కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : బెంగుళూరులోని షాటోకాన్ కరాటే అకాడమి ఆఫ్ ఇండియా వారు 4వ తేదీ నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే పోటీలలో కడప పవన్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి కుమితే(ఫైట్)లో నాలుగు ట్రోఫీలను కైవసం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి సోమవారం తెలిపారు. ఇందులో 35 కేజీ ఫైట్ విభాగంలో మేఘన ఫస్ట్ ప్లేస్ ట్రోఫీని సాధించగా, ప్లస్ 35 విభాగంలో విగ్నేష్ ఫస్ట్ ప్లేస్ ట్రోఫీని, ప్లస్ 45 కేజీ విభాగంలో అను ఏంజిల్ రెండవ స్థానంలో ట్రోఫీని, ప్లస్ 50 కేజీల విభాగంలో చైతన్యకుమార్ మూడవ స్థానం ట్రోఫీని గెలుచుకున్నట్లు ఆయన తెలిపారు. మెడల్ సాధించిన విద్యార్థినీ విద్యార్థులతోపాటు కరాటే కోచ్ విజయ్‌ని పాఠశాల కరస్పాండెంట్ అభినందించారు.

## దర్శకుడు జాకట రమేష్‌కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న జాకట రమేష్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ జిల్లా వాసి, లఘు చిత్రాల దర్శకుడు జాకట రమేష్‌కు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పురస్కారం లభించింది. ఈనెల 4వ తేదీ తిరుపతి మహతి ఆడిటోరియంలో 2024 ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులు అందజేశారు. ఇందులో నందమూరి తారకరత్న హీరోగా నటించిన ×సారథి× చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా రమేష్‌కు అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించిన జీ టీవీ అవార్డుల కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## డీఐజీని కలిసిన జిల్లా ఎస్పీ



కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావును కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : కర్నూలు- కడప రేంజ్ నూతన డీఐజీగా బాధ్యతలు చేపట్టిన సి.హెచ్. విజయరావును మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సోమవారం కలిశారు. కర్నూలులోని డి.ఐ.జి కార్యాలయంకు వెళ్లి డీఐజీని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. వైఎస్ఆర్ జిల్లాలో శాంతిభద్రతలకు సంబంధించిన విషయాలను డీఐజీకి ఎస్పీ వివరించారు.

# కడపవాసికి ఉత్తమ డైరెక్టర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న హేమారెడ్డి

కడప కల్చరల్ : ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ జిల్లాకు చెందిన యువ సినీ దర్శకుడు యు.హేమారెడ్డికి బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ అవార్డు బహూకరించింది. ఆదివారం రాత్రి తిరుపతిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు ఈ పురస్కారాన్ని అందజేశారు. 2024 సంవత్సరానికి ఉత్తమ తొలి సినిమా తీసిన డైరెక్టర్‌గా ఆయనకు ఈ పురస్కారం లభించింది. హేమారెడ్డి వైఎస్సార్ జిల్లాకు చెందిన వారు. ఆయన సోదరుడు ఎస్వీ శివారెడ్డి సినీ రంగంలో ఫొటోగ్రాఫర్‌గా ఉన్నారు. ఆయన సహకారంతో హేమారెడ్డి గత సంవత్సరం ఏపీ04 రామాపురం చిత్రం తీశారు. ఈ సినిమాకే అవార్డు దక్కింది. నిర్మాతలు కూడా వైఎస్సార్‌జిల్లాకు చెందిన వారు కావడం విశేషం.

# నేటి నుంచి విష్ణు సహస్ర నామ జప యజ్ఞం

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో 24వ వార్షికోత్సవం సందర్భంగా పలు ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త దేశు వెంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 7 నుంచి 10వ తేది వరకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహిస్తామన్నారు. 7వ తేది సాయంత్రం 4.30 గంటలకు అయోధ్యలో కరసేవ చేసిన వారికి సత్కారం ఉంటుందన్నారు. 8వ తేది సాయంత్రం 6.30 గంటలకు ఆలయ బృందంచే కోలాటం ప్రదర్శన ఉంటాయన్నారు. 9వ తేది సాయంత్రం 6.30 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. 10వ తేది ఉదయం 5.30 గంటల నుంచి నగర సంకీర్తన, 6.30 గంటలకు పూజాధికాలు, 8.00 గంటల నుంచి శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ కోటి జపయజ్ఞం నిర్వహిస్తామన్నారు.

# ఆశాల పెండింగ్ అలవెన్సులు చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన పెండింగ్ అలవెన్సులు వెంటనే చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వేణుగోపాల్, అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, కల్పన, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, అమ్ములు కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ లెప్రసీ, మలేరియా, టీబీ, ట్యూబెక్టమి అలవెన్సులు నిలిపివేయడం అన్యాయమన్నారు. కరోనా అలవెన్సులు ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఆశాల అలవెన్సులు విడుదల చేయాలని కోరారు. సాధారణ సెలవులు, మెటర్నటీ లీవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు మంజుల వాణి, ఏరియా కార్యదర్శి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ధరించి ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఏపీఎస్ ఆర్టీసీ కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ గ్యారేజీలో ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కడప డిపోలో డ్రైవర్ ఏపీ పద్మనాభం కోటిరెడ్డిసర్కిల్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందారన్నారు. అలాగే మరో డ్రైవర్ కుమార్ తనయుడు టూ వీలర్ ప్రమాదంలో తలకు దెబ్బతగిలి మంచానికే పరిమితం అయ్యాడన్నారు. కార్మికులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆయన హెల్మెట్ ధరించి సైకిల్‌పై వచ్చి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓ గోపాల్‌రెడ్డి, డీఎం ఢిల్లీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి పాల్గొన్నారు.

# మాధవీ.. మర్యాద ఇచ్చి మాట్లాడడం నేర్చుకో..

- వినయం ఉంటేనే ప్రజలు గౌరవిస్తారు
- వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్ల మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు

కడప కార్పొరేషన్ : కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాధవీరెడ్డి మర్యాద ఇచ్చి మాట్లాడటం నేర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణవేణి, కో ఆప్షన్ సభ్యులు బండి మరియలు, పత్తి రాజేశ్వరిలు హెచ్చరించారు. సోమవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. డిప్యూటీ సీఎం అంజాద్ బాషాపై మాధవి అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడటం దారుణమన్నారు. మగవారిని మాధవి మాట్లాడే తీరు చూస్తుంటే కట్టుకున్న భర్తకు ఆమె ఇచ్చే గౌరవం ఏమిటో తెలిసిపోతోందని ఎద్దేవా చేశారు. కడప నియోజకవర్గ అభివృద్ధిపై రాజకీయ పార్టీ నేతలుగా విమర్శలు, ప్రతి విమర్శలు సహజమేనని, అది వ్యక్తిగత విమర్శలకు దారి తీయకూడదన్నారు. నాలుగేళ్లు ఎక్కడ ఉన్నారో తెలియని మీరు ఎన్నికలు వచ్చేసరికి ఊడిపడి హడావిడి చేస్తున్నందునే మా డిప్యూటీ సీఎం విమర్శించారన్నారు. అంతే తప్పా ఎవరినీ హేళన చేయలేదన్నారు. కడపలో కరోనా విజృంభించిన సమయంలో మాధవి ఎక్కడున్నారని డిప్యూటీ సీఎం విమర్శిస్తే, నిజాన్ని అంగీకరించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదన్నారు. రాజకీయాల్లో ఉన్నవారికి వినయం, వినమ్రత ఉంటేనే ప్రజలు ఆదరిస్తారనే విషయం మాధవి గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, సుశీలమ్మ, మల్లీశ్వరి, జింకా విజయలక్ష్మి పాల్గొన్నారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు



కడప కేంద్ర పురుషుల కారాగారంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సోమవారం రాజంపేట సబ్‌జైలును సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఖైదీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైళ్లలో వున్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి తగిన న్యాయ సహాయం అందజేస్తామన్నారు. పాన్ ఇండియా -2024 అనే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైలులో నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్‌జైల్ సూపరింటెండెంట్, పానెల్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

- నందలూరు, సిద్దవటం కోర్టులను జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సందర్శించారు. ఈనెల 9న జరుగబోయే జాతీయలోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని ఆయా కోర్టుల న్యాయవాదులతో సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందలూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కోలార్ లత, సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాస కళ్యాణ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ ప్రెసిడెంట్‌లు, పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.
- పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కడప కేంద్ర పురుషుల కారాగారంను సందర్శించారు. ఖైదీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మనోహర్, పురుషుల కేంద్ర కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలను కేటాయించాలి

కడప రూరల్ : జిల్లాలోని మాజీ సైనికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని జిల్లా మాజీ సైనికుల కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు జడ్ ఫిలిప్స్ తెలిపారు. ఆ మేరకు సోమవారం స్థానిక నూతన కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జీ గణేష్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఫిలిప్స్ మాట్లాడుతూ మాజీ సైనికులకు ఇంటి స్థలాలకు సంబంధించిన భూమిని ఉచితంగా లేదా ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం కేటాయించాలని కోరారు. స్థలం సిద్దవటం, చింతకొమ్మదిన్నె పరిధిలో కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పోస్టర్ల ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఎన్నికల ప్రచారానికి సంబంధించి పోస్టర్లను బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9, 10, 11 తేదీలలో పల్లెకు పోదాం ప్రవాసీ యోజన కార్యక్రమం కింద కార్యకర్తలు ప్రతిఊరిలో నిద్ర చేయాలని, ఈ సందర్భంగా గ్రామీణులకు దేశ ప్రధాని అమలు చేస్తున్న పథకాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిడి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.